RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 139 పేజీలు - 08 గురువారం 16 ఏప్రిల్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## విషాదం..డిటోనేటర్లు పేలి నలుగురు దుర్మరణం..

మరో 12 మంది పరిస్థితి విషమం



**తొలి అక్షరం/అమరావతి ఏప్రిల్ 15:** ఏపీలో విషాదం చోటు చేసుకుంది. ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు మృత్యువాత పడ్డారు. సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవార్ల గ్రామంలో బుధవారం ఓ ఇంట్లో నిలువ ఉంచుకున్న రాళ్లు బద్దలు చేసే మిగతా2లో...

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు



- శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం
- ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు

**తొలి అక్షరం/వాషింగ్టన్,ఏప్రిల్ 15:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను మిగతా2లో...

## తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

- పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**తొలి అక్షరం/హైదరాబాద్,15:** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ మిగతా2లో...

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్ సిగ్నల్



- ఒకట్రెండు రోజుల్లో జీవో
- మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం

పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి

**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 15:** అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో మిగతా2లో...

# టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్


- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా కొనసాగింపు
- ఇద్దరు క్షేత్రస్థాయి నేతలకు పోలిట్ బ్యూరోలో స్థానం
- పార్టీ కార్యవర్గాన్ని పునర్నిర్మించిన చంద్రబాబు



**తొలి అక్షరం/అమరావతి,ఏప్రిల్ 15:** టిడిపి కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్‌ను ప్రకటించింది. పార్టీకి ఇప్పటి వరకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేశ్‌ఓ రకంగా ప్రమోషన్ పొందారు. మెల్లగా ఆయన చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నారు. ఇప్టపికే పార్టీలో అంతా తానై నడిపిస్తున్నారు. ఇకపోతే తెదేపా ఏపీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ కొనసాగనున్నారు. పొలిటిబ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ఈ మేరకు పార్టీ ప్రకటించింది. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శులుగా రామ్మోహన్ నాయుడు, బైరెడ్డి శబరి, రాజేశ్ కిలార్‌లను పార్టీ నియమించింది. సీనియర్లకు గౌరవమిస్తూ.. కొత్తవారికి అవకాశాలు కల్పిస్తూ.. సామాజిక కోణంలో నూతన కమిటీల కూర్పు జరిగింది. విధేయత, కష్టపడే తత్వం, అనుభవం లెక్కించి అధిష్ఠానం పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు రాని వారికి మిగతా2లో...

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 15:** పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన మిగతా2లో...




## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత

**తొలి అక్షరం/వికారాబాద్,ఏప్రిల్ 15:** వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్‌కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో మిగతా2లో...

## డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తాం

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము అనుకూలం
- కేంద్రం తీసుకొస్తున్న విధానం సరికాదు
- ప్రతిపక్ష 'ఇండియా బ్లాక్' పార్టీలు స్పష్టం



2లో

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం
- మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం
- రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం
- లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు
- మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 15:** తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిట లైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయిం చారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు మిగతా2లో...

## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

- మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు
- నియోజకవర్గాల పునర్విభజనతో ముడి పెట్టడానికి వ్యతిరేకం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 15:** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభు త్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ, మొత్తం దక్షిణ భారతదేశం మిగతా2లో...




## పునర్విభజన జనాభా ప్రకారమే...

- రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే
- సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**తొలి అక్షరం/వరంగల్,ఏప్రిల్ 15:** నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 మిగతా2లో...

# టీడీపి కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ పదవుల ద్వారా న్యాయం కల్పించింది. అన్ని సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పుపై పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కసరత్తు చేశారు.29 మందితో పొలిట్ బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీ కూర్పు చేశారు.జాతీయ ప్రధాన కార్యదర్శులు-3, జాతీయ ఉపాధ్యక్షులు-18, జాతీయ అధికార ప్రతినిధులు-10 రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు-7, రాష్ట్ర ఉపాధ్యక్షులు-16, రాష్ట్ర అధికార ప్రతినిధులు-14, రాష్ట్ర జోనల్ కో-ఆర్డినేటర్లు-10, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు -59, రాష్ట్ర కార్యదర్శులు-77 తో పునర్నిర్మించారు.ఓ మండల పార్టీ అధ్యక్షురాలికి, ఓ క్లస్టర్ ఇన్ఛార్జికి నేరుగా పొలిట్ బ్యూరోలో చోటు కల్పిస్తూ సంచలన నిర్ణయం తీసుకకున్నారు.

పార్టీ అత్యున్నత స్థాయి కమిటీ పొలిట్ బ్యూరోలో చోటు దక్కించుకున్న గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్ఛార్జ్ గుత్తికొండ ధనుంజయ్ అత్యున్నత స్థాయికి ఎదిగారు. రాష్ట్ర కమిటీలోని 185 మందికి గానూ... 50 మంది మహిళలకు చోటు, పొలిట్ బ్యూరో, జాతీయ కమిటీ ల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించారు. జనాభా దామాషా పద్ధతిన, సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు బేరీజు వేసుకుని కమిటీల కూర్పు చేశారు. 185 మంది రాష్ట్ర కమిటీ సభ్యుల్లో 122 మంది బడుగులకు స్థానం కల్పించింది. బీసీ-77, ఎస్సీ-25, ఎస్టీ-7, మైనార్టీ-13 మందికి రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని కోణాల్లో విశ్లేషించి చంద్ర బాబు కమిటీల కూర్పు చేపట్టినట్లు అర్థంఅవుతోంది.

# నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి. అయితే ఇదివరకు వివిధ పార్టీల నాయకులతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చలు జరిపినప్పుడు.. మొత్తం స్థానాలను గంపగుత్తగా 50శాతం పెంచుతామని చెప్పారు. ఆ ప్రకారం చూస్తే ఇప్పుడున్న 543 స్థానాలు 816కి చేరే అవకాశం ఉంటుంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి.. గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడానికి తాజా బిల్లును కేంద్రం ప్రతిపాదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 అసెంబ్లీ స్థానాల పునర్విభజన, ఆర్టికల్ 170 అసెంబ్లీ స్థానాల గరిష్ఠ సంఖ్య గురించి చెబుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న నిబంధనల ప్రకారం ఆర్టికల్ 82 కింద అసెంబ్లీ స్థానాలను పునర్విభజించాలంటే 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇప్పుడు ఆ నిబంధనను సవరించి ప్రతి జనాభా లెక్కల తర్వాత అసెంబ్లీ స్థానాలను పునర్విభజించడానికి అవకాశం కల్పించారు. ఆర్టికల్ 334ఏలో ఇదివరకు 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 (మహిళా రిజర్వేషన్ల చట్టం) ఆమోదం పొందిన తర్వాత చేపట్టే తొలి జనాభా లెక్కల ప్రాతిపదికన నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఇప్పుడు దాన్ని సవరించి డీలిమిటేషన్ పక్రియ పూర్తయిన వెంటనే ఇవి అమల్లోకి వస్తాయని స్పష్టత ఇచ్చారు.

# డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తాం

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 15:** ''డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మేము వ్యతిరేకం కాదు. కానీ కేంద్రం ఈ బిల్లును తీసుకొస్తున్న విధానం సరికాదు'' అని ప్రతిపక్ష 'ఇండియా బ్లాక్' పార్టీలు స్పష్టం చేశాయి. బుధవారం నాడిక్కడ రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండియా బ్లాక్' పార్టీల సమావేశం జరిగింది. ఒకపక్క రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతుండడం, మరోపక్క కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల డిమాండ్లను పట్టించుకోకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఏకపక్షంగా 'మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్'ను ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆ బిల్లులపై ప్రతిపక్ష ''ఇండియా బ్లాక్'' పార్టీల సమావేశంలో నేతలు చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, కె.సి వేణుగోపాల్, జైరాం రమేష్, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), టి.ఆర్ బాలు (డీఎంకే), సంజయ్ సింగ్ (ఆప్), సంజయ్ రౌత్, అరవింద్ సావంత్ (శివసేన), నిలోత్పల్ బసు (సీపీఐ(ఎం), ఆనీరాజా (సీపీఐ), సుప్రియా సూలే (ఎన్సీపీ), సాగరిక ఘోష్ (టీఎంసీ), కె.ఎం మణి (కేరళ కాంగ్రెస్), ఎన్.కె ప్రేమ్ చంద్రన్ (ఆర్ఎస్పీ), ఈటి మొహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), కపిల్ సిబల్ (ఇండిపెండెంట్) పాల్గొన్నారు. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

**ఈ బిల్లు రాజకీయ ప్రేరేపితమైంది: ఖర్గే**

మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదని, ఈ బిల్లును కేంద్రం తీసుకొస్తున్న విధానం సరికాదని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. అలాగే, డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తాము వ్యతిరేకించడం లేదన్నారు. కానీ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్నే తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు పన్నుతోందని విమర్శించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు.''మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రతిపక్షాలు సానుకూలమే. కానీ కేంద్రం తీసుకొస్తున్న విధానంలోనే మాకు అభ్యంతరాలున్నాయి. ఈ బిల్లు రాజకీయ ప్రేరేపితమైందిగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల్ని అణచివేసేందుకే కేంద్రం ఈ పని చేస్తోంది. అయినప్పటికీ మేం ఈ బిల్లుకు మద్దతిస్తూ వస్తున్నాం. కానీ, గతంలో చేసిన మార్పుల్ని అమలు చేయాలని కోరాం. డీలిమిటేషన్ అంశంలో కూడా కేంద్రం కొన్ని మెలికలు పెడుతోంది. ఈ అంశంపై అన్ని పార్టీలు పార్లమెంట్‌లో పోరాడుతాయి. డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తాం. కానీ, మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తాం. డీలిమిటేషన్‌కు సంబంధించి జనాభా గణన అంశంపై స్పష్టత లేదు.

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్ సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

సీఎం బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుపై సైతం వారు చర్చించారు. కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్ విభజన, రాష్ట్రానికి జరగబోయే నష్టం గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా త్వరలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించాలంటూ ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు.కాగా కార్పొరేషన్లతోపాటు పార్టీ పదవులను భర్తీ చేసేటప్పుడు క్రియాశీలకంగా ఉన్న జిల్లాలు, అక్కడి సామాజిక సమీకరణాలు, పార్టీ కోసం పనిచేసిన నేతలు తదితరాంశాలపై జాబితాను రూపొందించాలంటూ సీఎం సూచించారు. ఒక్కో ఆశవహుడి పేరును ప్రస్తావిస్తూ ఆయన చర్చించారు. 'ఒక్కరికి కేవలం ఒక పదవే...' అనే సూత్రాన్ని పక్కాగా, తూ.చా. తప్పకుండా పాటించాలంటూ కోరారు. ఇదే విధంగా భవిష్యత్ అవసరలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమీకరణాలు, పొందికలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు. ఇప్పటికే కార్పొరేషన్ చైర్మెన్లు, ప్రభుత్వ సలహాదారుల పోస్టుల కోసం వందలాది మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఆ జాబితాను సాధ్యమైనంతగా వడబోసి, పార్టీకి విధేయులుగా ఉండి, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకోసం పని చేసి, క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించాలని సీఎం భావిస్తున్నారు. వారిలోంచి మొదటి దఫాగా 20 నుంచి 25 మందికి పదవులను కట్టబెట్టాలని ఆయన నిర్ణయించారు. ఇదే సమయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక తరగతులకు ప్రాధాన్యతనిస్తూనే రెడ్డి సామాజిక తరగతిని కూడా 'సంతృప్తి' పరిచే విధంగా జాబితాలను సిద్ధం చేయాలని సీఎం... పీసీసీ చీఫ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో కనీసం 30 శాతం మహిళలకు కేటాయించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. మూడేండ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమనీ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణతోపాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. ''ఢిల్లీ పాలకులు తమ మాట వినాలనీ, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాకుండా, అసెంబ్లీ, శాసన మండలిలో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయనీ, వాటికి వర్తింపజేయాలని సూచించారు. తెలంగాణ లో 119 అసెంబ్లీ స్థానాలున్నాయనీ, ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. సీట్ల పెంపు పునర్విభజనతో ముడిపెట్టి ఎందుకు అయోమయా న్ని సృష్టిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. రాజ్యాంగ విధివిధానాల ప్రకారం మొదట జనగణన, తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, ఆ తర్వాతే నిర్మాణాత్మక మార్పులు జరగాలని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనా లకు విఘాతం కలగని ఏ సహేతుకమైన ప్రతి పాదనకైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. దక్షిణాదికి అన్యాయం చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామనీ, అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.ద

# విషాదం..డిటోనేటర్లు పేలి నలుగురు దుర్మరణం..

(మొదటి పేజీ తరువాయి)

డిటేనేటర్లు పేలాయి. దీంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలి ఇంట్లో ఉన్న నలుగురు మృతి చెందారు. మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి.వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పేలిన ఇళ్లు పూర్తిగా నేలమట్టామయ్యింది. గ్యాస్ పేలుడు దాటికి సమీపంలో ఉన్న ఇళ్లు స్వల్పంగా ధ్వంసమయ్యాయి . పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు ముమ్మరం చేశారు.

# తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది.నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

# పునర్విభజన జనాభా ప్రకారమే...

(మొదటి పేజీ తరువాయి)

జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమై నవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమె త్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యత రాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచం దర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ పక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన పక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

(మొదటి పేజీ తరువాయి)

రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

# పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు

**● మీడియా ముందు మంగ్లీ ఆవేదన**

**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 15:** తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియా తో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజు లుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు. సుభాక్షేత్ర బిజినెస్ అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి.. దానికి ఎండీగా ఉన్నది మధు. ప్రస్తుతం బాధితుడిగా మీడియాతో మాట్లాడుతున్న హిమాకాంత్ రెడ్డి ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఈ స్కామ్‌కి మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు' అని అన్నారు.

## తొర్రూర్ మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక నిర్వహించాలి: కమిషనర్‌కు బిఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 15:** తొర్రూర్ మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికను తక్షణమే నిర్వహించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ కౌన్సిలర్లు మరియు నాయకులు బుధవారం తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ వి. శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చట్టం మరియు 2019 ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యుల నియామకం జరగాల్సి ఉందన్నారు. పరిపాలనా విభాగం బలోపేతం కావాలన్నా, పట్టణ అభివృద్ధిలో చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకోవాలన్నా కో-ఆప్షన్ సభ్యుల పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే ఈ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ భూసాని జయమ్మ ఉప్పలయ్య, 3వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి రవి, 4వ వార్డు కౌన్సిలర్ పేర్ల జంపన్న, 7వ వార్డు కౌన్సిలర్ మాడుగుల భవానీ లత, 8వ వార్డు కౌన్సిలర్ అల్లం శ్యామల, 9వ వార్డు కౌన్సిలర్ కిన్నెర కవితా సతీష్, 11వ వార్డు కౌన్సిలర్ కర్నే నాగరాజు, 12వ వార్డు కౌన్సిలర్ పద్మ కిషన్ నాయక్, 15వ వార్డు కౌన్సిలర్ చకిలేల అలివేణి నాగరాజులతో పాటు బిఆర్ఎస్ నాయకులు చకిలేల మణిరాజ్, భూసాని ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ కుటుంబాలకు ఆర్థిక భరోసా: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 15:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యూటీఎఫ్ కేవలం హక్కుల కోసం పోరాడే సంఘం మాత్రమే కాదని, అది ప్రతి ఉపాధ్యాయుడిని కాపాడుకునే ఒక గొప్ప కుటుంబమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అన్నారు. తొర్రూర్ మండల కార్యదర్శి స్వర్గీయ తాళ్లూరి రాయల్ స్మారక సభ బుధవారం జిల్లా అధ్యక్షులు ఎ. మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా రాయల్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం, ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ ద్వారా మంజూరైన 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని రాయల్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ. ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ ఒక వరం ఒక్కరి కోసం అందరూ - అందరి కోసం ప్రతి ఒక్కరు" అనే నినాదంతో 2023 జూలై 1 నుండి అమల్లోకి వచ్చిన ఈ ఫండ్, అర్థాంతరంగా మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని చావ రవి పేర్కొన్నారు. 3.30 కోట్ల ఆర్థిక సహాయం: ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మరణించిన 55 మంది సభ్యుల కుటుంబాలకు రూ. 6 లక్షల చొప్పున మొత్తం 3 కోట్ల 30 లక్షల







రూపాయలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే అంత్యక్రియల కోసం తక్షణమే రూ. 20 వేలు చెల్లించాలనే జీవో ఉన్నప్పటికీ, కనీసం ఆ మొత్తాన్ని కూడా చెల్లించే స్థితిలో ప్రస్తుత ప్రభుత్వం లేదు" అని చావ రవి విమర్శించారు. మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు రావాల్సిన టిఎస్ జిఎల్ఐ, జిపిఎఫ్, గ్రాట్యూటీ, కమ్యూటేషన్ వంటి బకాయిలను ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న తొర్రూర్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ సోమ రజని రాజశేఖర్ మాట్లాడుతూ..సాధారణంగా సంఘాలు సమస్యలపైనే మాట్లాడతాయని, కానీ ఒక సభ్యుడు చనిపోతే వారి కుటుంబానికి రూ. 6 లక్షల భారీ సాయం అందించడం అత్యంత మానవీయమైన కార్యక్రమని కొనియాడారు. ఉపాధ్యాయులందరూ ఈ సంక్షేమ నిధిలో చేరి భరోసా పొందాలని ఆమె సూచించారు. ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ చైర్మన్ ఎం. రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మల్లారెడ్డి, సోంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకూబ్, మాజీ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య, జిల్లా కార్యదర్శులు హరినాయక్, సంజీవ, బిక్షపతి, మండల అధ్యక్షులు ఎండి రఫీ, ప్రధాన కార్యదర్శి చైతన్య మరియు వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిట్టిమల్ల మహేష్‌కు దళిత రత్న అవార్డు ప్రధానం




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 15:** దళిత సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనే ఉద్యమ నాయకుడు చిట్టిమల్ల మహేష్ కు దళితరత్న పురస్కారం దక్కింది. తాజాగా హైదరాబాదులోని రవీంద్ర భారతిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా పలువురు ఉద్యమకారులకు దళిత రత్న అవార్డు దక్కింది. మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన చిట్టిమల్ల మహేష్ మాల మహానాడు జిల్లా అధ్యక్షునిగా వ్యవహరిస్తూ దళిత అట్టడుగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. దళిత ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్రను గమనించిన దళితరత్న పురస్కార కమిటీ ఆయనకు దళిత రత్న పురస్కారం అందించేందుకు నిర్ణయించింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉత్సవ కమిటీ కో చైర్మన్లు అల్లిబిల్లి మహేందర్, దొమ్మాటి సుదర్శన్ బాబుల చేతులమీదుగా మహేష్ కు దళితరత్న అవార్డు అందజేశారు. 2012 నుండి క్రియాశీల కార్యకర్తగా మాల మహానాడులో పనిచేశారు. నివాకానికి సహకరించిన ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీబీఎస్ఈ ఫలితాల్లో ఏకశిల విద్యార్థుల ప్రభంజనం

### విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి రెడ్డి

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 15:** కేంద్ర మాధ్యమిక విద్యా మండలి సీబీఎస్ఈ బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో హన్మకొండలోని ఏకశిల హైస్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. అత్యున్నత మార్కులతో పాఠశాల కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారు. విద్యార్థులు సాధించిన కొన్ని అత్యున్నత మార్కులు ఇలా ఉన్నాయి. 492, 492, 490, 489, 488, 488, 487, 484, 482, 480. ఇలా వరుసగా మెరుగైన స్కోర్లతో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన



సభలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ. నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలతో పాటు, నేటి సీబీఎస్ఈ ఫలితాల్లోనూ తమ విద్యార్థులు ఘనవిజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ, పాఠ్యేతర అంశాల్లోనూ వారికి పట్టు సాధించేలా శిక్షణ ఇవ్వడం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయి. తల్లిదండ్రులు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు జేతి కొండల్ రెడ్డి, సువిజా రెడ్డి, చిదురాల దినేష్ రెడ్డి, చిదురాల శ్రావణి రెడ్డి, ప్రిన్సిపల్ ఎండి బాబా, కేడీ స్వర్ణ రాజు, జీ రామ్ ప్రసాద్ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మోదీకి పాలాభిషేకం.. మహిళా రిజర్వేషన్‌పై హర్షం



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 15:** నాచారం డివిజన్‌లో ఉప్పల్ మహిళా కన్వీనర్, నాచారం డివిజన్‌లో కంటెస్టెడ్ కార్పొరేటర్ అనితా పద్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ, దానికి చట్టబద్ధత ఇవ్వడానికి పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ పాలాభిషేకం చేపట్టారు. మహిళలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంపై పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జ్యోతి రెడ్డి, వరలక్ష్మి, దింపుల్, కల్పన, రమ, ఇందిరా, కాంత తదితరులు పాల్గొన్నారు. మహిళలు, కాలనీ పెద్దలు ఉత్సాహంగా పాల్గొని మోదీకి మద్దతు తెలిపారు.

## కాంగ్రెస్ పాలనలో అన్నీ కష్టాలే ...

### దొంగ హామీలతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన రేవంత్ రెడ్డి

### వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మళ్ళీ సీఎం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**తొలి అక్షరం/ మేడిపల్లి/ ఏప్రిల్ 15:** ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు 420 దొంగ హామీలను ఇచ్చిన రేవంత్ రెడ్డి ప్రజలను మభ్యపెట్టి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నాడని ఆయన నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలకు కష్టాలు తప్ప ఒరిగిందేమీ లేదని బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పీర్జాదిగూడ మాజీ కార్పొరేటర్ పోచయ్య, విద్యా సంస్థల అధిపతి మధుకర్ పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి సమక్షంలో గులాబీ కండువలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల పాలనలో హైదరాబాద్ అన్ని రంగాల్లో దెబ్బతిందని నగరవాసులు లెక్కలేనని కష్టాలు పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఎంతో అభివృద్ధి చెంది ఉన్న నగరాన్ని వదిలిపెట్టి తన రియల్ ఎస్టేట్ కోసం ఫోర్త్ సిటీని, ఫ్యూచర్ సిటీని రేవంత్ రెడ్డి ప్రమోట్ చేస్తున్నాడని, రాష్ట్ర రాజధానిని దొంగలకు దోమలకు వదిలిపెట్టాడని, గతంలో ఎప్పుడూ చూడని కరెంట్ కోతలు, మంచినీటి ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలతో నగరవాసులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిజెపి పార్టీ సైతం తమ స్వలాభం కోసం తెలంగాణ రాష్ట్రాన్ని అతీగతీ లేకుండా చేస్తుందని అన్నారు. పార్లమెంటు అసెంబ్లీ సీట్ల పెంపు విషయంలో సైతం తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని చూస్తుందని ఆరోపించారు. సీట్ల పెంపు విషయంలో అన్యాయం జరిగితే దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేసి మరో పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి మెట్రో నగరంగా తీర్చిదిద్దామని, అందుకే ప్రజలు రెండు సార్లు రాష్ట్ర రాజధానిలో మేయర్ పీఠాన్ని, అసెంబ్లీ స్థానాలను మా పార్టీకి కట్టబెట్టారని గుర్తు చేశారు. బీఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఏమాత్రం డీలపడద్దని వచ్చే ఎన్నికల్లో మరోసారి విజయ డంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో జరిగే జిహెచ్ఎంసి, మండల పరిషత్ జిల్లా పరిషత్ ఎన్నికల్లో సైనికుల్లాగా పనిచేసి కెసిఆర్ ప్రభుత్వంలోని విజయాలను, రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మల్కాజ్గిరి పార్లమెంట్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిబీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక నిల్వలపై రెవెన్యూ శాఖ ఉక్కుపాదం

- గుర్తూరులో ఇసుక సీజ్
- బహిరంగ వేలంలో 29 వేల రూపాయలు పలికిన ఇసుక
- దక్కించుకున్న సిరికొండ విక్రమ్
- అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు
- తొర్రూర్ తాసిల్దార్ జి. శ్రీనివాస్ హెచ్చరిక





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 15:** మండల పరిధిలోని గుర్తూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వలపై రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. తొర్రూర్ తాసిల్దార్ జి. శ్రీనివాస్ నేతృత్వంలో ఆర్ఐ మరియు సిబ్బంది కలిసి ఈ ఇసుకను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకకు అదే గ్రామంలో అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో పలువురు పోటీ పడగా, చివరకు సిరికొండ విక్రమ్ అత్యధికంగా 29 వేల రూపాయలు పాడి ఇసుకను దక్కించుకున్నారు. వేలం నిబంధనల ప్రకారం నగదు చెల్లించిన అనంతరం అధికారులు ఇసుకను వారికి అప్పగించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడైనా సరే అనుమతి లేకుండా ఇసుకను నిల్వ చేసినా లేదా అక్రమంగా రవాణా చేసినా సహించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ ఖనిజ సంపదను కాపాడటంలో ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిటి ఉప్పల నరసయ్య, జిపిఓలు పాల్గొన్నారు

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తండాల అభివృద్ధి..

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జినుకల రమేష్...

### నిప్పు తొక్కిన కోతిలా విపక్షం

**తొలి అక్షరం/నర్సింహుల పేట ఏప్రిల్ 15:** ప్రజా ప్రభుత్వం తోనే తండాల అభివృద్ధి జరుగుతుందని నర్సింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్ అన్నారు. బుధవారం లోక్య తండా గ్రామపంచాయతీ పరిధిలో మామోజీ బంగారు తండాలో డోర్నకల్ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్ కృషి మేరకు సర్పంచ్ గూగులోత్ రాజేందర్ అధ్యక్షతన సీసీ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీనుకల రమేష్ మాట్లాడుతూ అధికారం లేక విపక్షం నిప్పుతొక్కిన కోతిలా విలవిల్లాడుతోందని, రాష్ట్రాన్ని



ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముందుకు వెళ్తున్నామని, నీటి పారుదల ప్రాజెక్టులు, హామ్ విధానం ద్వారా వేల కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికితే తమ ఉనికి ఉండదన్న భయంతోనే ప్రతిపక్షాలు 'ఇందిరమ్మ ఇండ్ల' పథకంపై విషప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో 70 ఏండ్ల కిందట కట్టిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు చెక్కుచెదరకుండా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ రెండేండ్లకే దెబ్బతిన్నదని విమర్శించారు. గత పాలకులు గోరంత చేసి కొండంత చెప్పుకున్నారు.. కానీ మన ప్రభుత్వం కొండంత అభివృద్ధి చేస్తున్నా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడి ఉన్నాం అన్నారు.. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు జీనుకల రమేష్, మండల ఎస్సీ ఎస్టీ అధ్యక్షులు బానోత్ దస్రు నాయక్ , మండల సోషల్ మీడియా కన్వీనర్ సతీష్ గౌడ్ సమన్వయ కమిటీ గ్రామ పార్టీ అధ్యక్షులు రమేష్ కాంగ్రెస్ నాయకులు రాజ్ కుమార్ సురేష్ రమేష్ ఏ ఈ సుగుణాకర్ వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు

# హెల్మెట్ ధరిస్తేనే ఇంటికి సురక్షితం.. విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల పాఠం!

**● ప్రాణం ఒక్కటే.. నిర్లక్ష్యం వద్దు: విద్యార్థుల్లో చైతన్యం నింపిన ఎస్సై సత్యానందం, ఆర్.ఐ రమేష్ నాయక్ ● పిల్లల ద్వారా పెద్దల్లో మార్పు రావాలి: రోడ్డు భద్రతపై విజ్ఞాన్ స్కూల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 15:** "మనం ధరించే హెల్మెట్ మన ప్రాణానికే కాదు.. మన కుటుంబానికి శ్రీరామ రక్ష" అని మియాపూర్ ట్రాఫిక్‌ఆర్.ఐ రమేష్ నాయక్ ఎస్సై సత్యానందం మరియు పిలుపునిచ్చారు. నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని విజ్ఞాన్ స్కూల్ లో 8, 9 తరగతి విద్యార్థులకు రోడ్డు భద్రత మరియు హెల్మెట్ ప్రాముఖ్యతపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఆలోచింపజేసేలా సాగింది. కుటుంబ రక్షణలో విద్యార్థులదే కీలక పాత్ర: ఈ సందర్భంగా ఆర్.ఐ రమేష్ నాయక్ మరియు ఎస్సై సత్యానందం మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల తీవ్రతను, వాటి నివారణలో హెల్మెట్ పోషించే పాత్రను విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. "మీ నాన్న, అన్న లేదా ఇంటి నుంచి ఎవరు బయటకు వెళ్లినా హెల్మెట్ లేకుండా వెళ్లనివ్వకండి. 'హెల్మెట్ పెట్టుకోండి.. సురక్షితంగా రండి' అని మీరు చెప్పే చిన్న మాట ఒక ప్రాణాన్ని కాపాడుతుంది" అని వారు విద్యార్థులకు హితబోధ చేశారు. హెల్మెట్ అనేది పోలీసుల కోసం కాదని, అది మన రక్షణ కవచమని వారు స్పష్టం చేశారు. ఉత్సాహంగా సాగిన అవగాహన పరీక్ష:కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెల్మెట్ ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన పరీక్ష నిర్వహించారు. నిబంధనల పట్ల విద్యార్థులు చూపుతున్న ఆసక్తిని అధికారులు అభినందించారు. ఈ సదస్సు కేవలం పాఠశాలకే పరిమితం కాకుండా, ప్రతి ఇంట్లో రోడ్డు భద్రతపై చర్చ జరిగేలా చేయడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఎస్సార్ టెంట్ హౌస్ వారి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**● ప్రారంభించిన నెక్కొండ ఎస్సై మహేందర్ రెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ఎస్సార్ టెంట్ హౌస్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివెంద్రం నందు ఉదయం 11 గంటల సమయంలో నెక్కొండ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహేందర్ రెడ్డి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పూల మాలతో నివాళి అర్పించిన అనంతరం, సార్ చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమం కోసం వారి అమూల్యమైన సమయాన్ని కేటాయించి నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తు ఈ కార్యక్రమానికి 25కెజిల ల పెరుగు ధాతగా వ్యవహరించిన గుండ్రపల్లి గ్రామ ట్రాక్టర్ యూనియన్ సభ్యులకు కూడా కృతజ్ఞతలు తెలుపుతూ, మధర్, ఈ కార్యక్రమంలో బోళ్ల శివకుమార్, ఉప సర్పంచ్ పటాన్ కాసిం మహమ్మద్ మదార్, నల్లగొండ సాంబరాజు, పెద్ద కృష్ణయ్య, దొంగల వేణు, దామచర్ల రామారావు, కనపర్తి వెంకన్న, బొంత రామచంద్రు, బోళ్ల శ్రీనివాస్, బోళ్ల రంజిత్ కుమార్, ఉదరి అశోక్, మనుబోతుల భక్తి రెడ్డి, నార్లపురం అశోక్, సుబ్బారావు, మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య శాఖలో అవినీతి తాండవిస్తుంది.

**● ఒక్కొ డిప్యూటేషన్కు ఒక్కొ రేటు. ● ముడుపులు అందితే విధులకు రాకున్నా ఒకే!. ● ఒక్కొ ఉద్యోగి నుండి భారిమొత్తంలో వసూళ్లు.**

**● జిల్లాలో ఓ కీలక అధికారి కీ రోల్.**




**తొలి అక్షరం /మహబూబాబాద్ జిల్లా వైద్యశాఖ ఏప్రిల్ 15:** మహబూబాద్ జిల్లా వైద్య శాఖలో అవినీతి తాండవిస్తోంది అవినీతి మయంగా మారింది. వైద్యశాఖలో ఏ పని జరుగాలన్నా జిల్లా అధికారి చేతులు తడుపాల్సిందే. సదరు అధికారి గతంలో వైద్యశాఖలో అన్ని డిప్యూటేషన్ లను రద్దు చేయించారు. దీంతో జిల్లాలో వైద్యశాఖలో నూతన ఒరవడి కొనసాగుతుందని, ప్రజలందరికి సకాలంలో వైద్య సదుపాయాలు అందుతాయని, జిల్లాలో వైద్య వ్యవస్థలో సమూల మార్పు వస్తుందని అంతా భావించారు. కాని అందుకు విరుద్ధంగా జిల్లా వైద్య వ్యవస్థలో అవినీతి తాండవించడంతో వైద్యశాఖ ఉద్యోగులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుత సమయంలో గతంలో రద్దు చేసిన డిప్యూటేషన్లకు మళ్లీ తెరలేపారు. ఒక్కొ డిప్యూటేషన్కు ఒక్కొ రేటు రూ.25వేల నుండి 50వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉద్యోగులు సమాన హోద కలిగిన వారు మ్యూచువల్ బదిలీలకు కూడా చెతులు తడుపుతేనే బదిలీ పత్రం అందుతుంది. మూడుపులు అందకుంటే అంతే సంగతులు. ఉద్యో గులు తమ కుటుంబ అవసరాలు, ఇబ్బందుల నేపథ్యంలో వారు అడిగి నంత ముట్టచెప్పి బదిలీలు చేయించుకుంటున్నట్లు సమాచారం. అదే విధంగా ఉద్యోగులు సంబంధిత జిల్లాస్థాయి అధికారికి ప్రతి నెలా మాముళ్లు ముట్టచెప్పాల్సిందే లేనియెడల వారిని సమావేశాల్లో వారిని టార్గెట్ చేసుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సంబంధిత శాఖ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు ఇవ్వాల్సిన మమూళ్లు ఒ మండల స్థాయి అధికారికి ఫోన్ పే ద్వారా వంపించుకొని, ఆ అధికారి నుండి నగదును తీసుకొని ఆర్బఎస్కె డ్రైవర్కు ఇవ్వగా అతను ఆ మొత్తాన్ని సదరు అవినీతి అధికారికి అందజేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వైద్యశాఖ అవినీతిశాఖగా మారిందని శాఖ ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. లంచం ఇవ్వడం నేరమని తెలిసిన సదరు అధికారి ఒత్తిడికి ఇవ్వక తప్పడంలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంచం ఇస్తే ఉదయం వచ్చి హాజరు వేసుకొని విధులకు దుమ్మా కొట్టినా ప్రశ్నించే వారు ఉండరని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. జిల్లా వైద్యశాఖలో బహిరంగంగానే ఇంతా అవినీతి జరుగుతున్నా కనీస చర్యలు లేకపోవడం ఏంటని పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సదరు అవినీతి అధికారిపై విచారణ చేపట్టి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని శాఖ ఉద్యోగులు కోరుతున్నారు.

# వలిగొండ గ్రామపంచాయతీ కార్మికుల సిబ్బందికి పోస్టల్ బీమా ఏర్పాటు

**● చేసిన బిజెపి నాయకులు ఏల చంద్రశేఖర్**




**తొలి అక్షరం/వలిగొండ, ఏప్రిల్, 15:** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షులు శ్రీ బోళ్ల సుదర్శన్ , ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు పల్లెర్ల నరసింహ గార్ల ఆధ్వర్యంలో వలిగొండ గ్రామపంచాయతీ కార్మికులకు పోస్టల్ ఇన్సూరెన్స్ ను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ ఏలే చంద్రశేఖర్ గారి సహకారంతో గ్రామపంచాయతీ కార్మికులకు పోస్టల్ ఇన్సూరెన్స్ పత్రాలను అందించడం జరిగింది. గౌరవ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాన్ని చేయడం జరిగింది. వారు మాట్లాడుతూ సమాజంలో పారిశుద్ధ్య కార్మికులు ఎనలేని సేవ చేస్తున్నారని, అందుకు వారి ఆరోగ్యంగా ఉంటూ, వారి కుటుంబాలను ఎల్లప్పుడూ కాపాడుకోవాలని వారికి వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బందారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, రాములు, రామ నర్సు, రాస వెంకట్, శ్రీనివాస్, వార్డ్ మెంబర్ అరుణ్, జగన్, పద్మా రెడ్డి, మండల పదాధికారులు నాగరాజు, దయాకర్ వెంకటేశం , వెంకటేశం, జంగయ్య , కార్మికులు, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు..

# తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయండి

**● తెలంగాణ ఉద్యమకారుల మండల అధ్యక్షులు కొత్త సంపత్ రెడ్డి**



**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం నుండి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుపోతు జ్యోతి రెడ్డి. జిల్లా అధ్యక్షులు నందగిరి రజినీకాంత్ ఆదేశాల మేరకు నెక్కొండ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు కొత్త సంపత్ రెడ్డి, అధ్యక్షతన సమావేశ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఏప్రిల్ 18 వ తేదీన హైదరాబాదులోని తార్నాక లో గల మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని, మండలంలోని తెలంగాణ ఉద్యమకారులకు పిలుపునివ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలలో 250 గజాల ఇంటి స్థలం. హెల్త్ కార్డులు. పెన్షన్. సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించాలని ప్రధాన డిమాండ్లతో నిర్వహించే సదస్సుకు మండలంలోని ప్రతి తెలంగాణ ఉద్యమకారుడు కదలి రావాలని పిలుపునివ్వడం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శాడా. సరితా రెడ్డి. కొత్త సంపత్ రెడ్డి. పరకాల. బిక్షపతి. పరిపాటి. ఇంద్రసేనారెడ్డి. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న ఎల్లయ్యకు యాదవ రెడ్డి పరామర్శ

**● తొర్రూర్ సిరి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్లయ్యను కలిసిన కాంగ్రెస్ నేత**

**● ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని ధైర్యం చెప్పిన నాయకులు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 15:** నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన పిట్టల ఎల్లయ్య అనారోగ్యంతో తొర్రూర్ సిరి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి ఆసుపత్రికి చేరుకొని ఎల్లయ్యను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్వతమ్మ గూడెం ఉప సర్పంచ్ నిదానపల్లి ప్రవీణ్, పెరుమాండ్ల జగన్ బాబు, జిల్లెల్ల సతీష్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నాయక్ తండా గ్రామపంచాయతీలో చలివేంద్రం ప్రారంభం

**● సర్పంచ్ బానోత్ మంజుల- మీటు నాయక్**

**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పరిధిలోని మహబూబ్ నాయక్ తండ గ్రామంలో వేసవి తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు దాహార్తినీ తీర్చే ఉద్దేశంతో ఏబి తండా , బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రాన్ని సర్పంచ్ బానోతు మంజుల –మీటు నాయక్ ప్రారంభించారు. ప్రయాణికులు కూలీలు, సాధారణ ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన,ఈ చలివేంద్రం స్థానికంగా ప్రశంశాలు అందుకుంటుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తాగునీరు అందుబాటులో ఉండడం అత్యవసరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, ఈ చలివేంద్రం ద్వారా ప్రజలకు కొంత ఉపశమానం కలుగుతుందని ఆశిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్,మాజీ సర్పంచ్ పూర్ణ, వార్డ్ నెంబర్ నవీన్, కారోబర్ భూక్య నరేష్, మలి శంకర్, సోమల, అంగన్వాడి టీచర్ సైదమ్మ రాములు, రవి, శ్రీను గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జాహ్నవి డిగ్రీ& పీజీ కళాశాల వీడ్కోలు కార్యక్రమం



**తొలి అక్షరం/ మేడిపల్లి/ ఏప్రిల్ 15:** జాహ్నవి డిగ్రీ & పీజీ కళాశాలలో అస్త్ర 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాహ్నవి గ్రూప్స్ ఇన్స్టిట్యూషన్ ఛైర్మన్ ఏ. పరమేశ్వర్ . వైస్ చైర్మన్ ఏ. లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ...విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, రేపటి భవిష్యత్తుకి దిక్సూచిగా కావాలని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు వైస్ చైర్మన్ ఏ. లక్ష్మి చేతుల మీదుగా బహుమితులు అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల పిన్సిపల్ మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఈదునూరి లింగయ్య పెద్దకర్మకు ఆర్థిక సాయం



**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల క్రింద అనారోగ్యంతో మృతి చెందిన ఈదునూరి లింగయ్య వారి పెద్దకర్మ రోజున వారి కుటుంబ సభ్యులను కలిసి 5000/– ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడ్య తిరుమల్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్,మాజీ ఎంపీటీసీ ఈదునూరి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు భాను ప్రకాష్,యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోడ ప్రవీణ్ కుమార్,ఈదునూరి రమేష్,వెంకటాపురం సర్పంచ్ అఖిల్ నెక్కొండ వార్డ్ మెంబర్స్ విష్ణు,విజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖలీల్, నరేందర్ పాల్గొన్నారు.

## మోపర్తి సరోజన పార్థివ దేహానికి నివాళులర్పించిన పెండ్యాల హరిప్రసాద్



**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి చెందిన అంగన్వాడి టీచర్ రాపాక మంజుల తల్లిగారైన మోపర్తి సరోజన అనారోగ్యంతో మృతిచెందగా వారి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లావుడ్య తిరుమల్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, అడ్వకేట్ బండి శివ,యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బోడ ప్రవీణ్,కుమార్ వెంకటాపురం సర్పంచ్ అఖిల్,నెక్కొండ వార్డ్ మెంబర్స్ విజేందర్,విష్ణు,మార్కెట్ డైరెక్టర్ రమేష్ యాదవ్, ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ బైపీసీలో మండల టాప్ ర్యాంక్ రాళ్ళబండి దేవిక.

**● సన్మానించిన నెక్కొండ సిఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ రెడ్డి**




**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో భాగంగా ఇంటర్ బైపీసీ లో మండల్ టాప్ ర్యాంక్. 989/1000 పొందిన, పాప రాళ్లబండి దేవిక కు నెక్కొండ సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్ రెడ్డి సర్ కాలేజీ ప్రిన్సిపాల్,శ్రీదేవి మేడం, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్ చే శాలువాతో సత్కరించి సన్మానించడం జరిగింది.

## "హెల్మెట్ హామీ ప్రాణాలకు రక్షణ




తలపై హెల్మెట్ ధరించు మనసే నిజమైన ధైర్యం,
జీవితం అమూల్యమని చెప్పే ప్రతి క్షణం అది సత్యం.
చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదమవుతుందని జ్ఞాపకం,
హెల్మెట్ ఒక కవచం.. ప్రాణాలకు అజరామరమైన రక్షణం.
రోడ్డు మీద వేగం కాదు, జాగ్రత్తే మన గమ్యం,
హెల్మెట్‌తో సాగితేనే సురక్షితమవుతుంది ప్రయాణం.
తల్లిదండ్రుల ఆశలు, పిల్లల నవ్వులు నిలిచేలా,
ప్రతి ప్రయాణంలో హెల్మెట్ తప్పనిసరి అలవాటు కావాలి.
పోలీసుల ప్రతిజ్ఞ ఒక మాట కాదు, అది బాధ్యత,
ప్రజల ప్రాణాల కోసం తీసుకున్న పవిత్ర సంకల్పం.
"హెల్మెట్ తప్పనిసరి" అంటూ వారు ఇచ్చే సందేశం,
మనందరి భవిష్యత్తుకు మార్గదర్శక దీపం.
మనమందరం కలిసి ఈ నియమాన్ని పాటిద్దాం,
ప్రాణాల విలువ తెలుసుకుని హెల్మెట్ ధరించుదాం.
సురక్షిత సమాజం కోసం చేతులు కలుపుదాం,
జీవితం అందంగా ఉండేలా ప్రతి క్షణం కాపాడుదాం.

– రచన: తాడూరి సంపత్
సీనియర్ రిపోర్టర్

## యువ నాయకులు పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న తెలంగాణ పంచాయతీ రాజ్ మాజీ ట్రిబ్యునల్ మెంబర్ ఘటిక అజయ్ కుమార్





**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల యువ నాయకులు గోపగాని శ్రీకాంత్ గౌడ్ పుట్టినరోజు సందర్భంగా నెక్కొండ మాజీ ఎంపీపీ & తెలంగాణ్ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్ గటిక అజయ్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివ కుమార్,పత్తిపాక మాజీ సర్పంచ్ & ఎంపీటీసీ బొల్లెబోయిన వీరస్వామి యాదవ్ ,కారింగుల సురేష్ గౌడ్,అప్పలరావుపేట మాజీ సర్పంచ్ వడ్డే సురేష్,మాజీ ఉప సర్పంచ్ వీరభద్రయ్య ,వెంకన్న, గిరిగానీ శ్రీను గౌడ్,సుధాకర్, సూలం సారయ్య,మురళి గౌడ్ ,సుభాష్ గౌడ్,ప్రభాకర్,డెక్క సాయి,శ్రీనాథ్ గౌడ్ ,శ్రవణ్ ,అక్కెనపెల్లి నవీన్ కుమార్,సుభాష్,సంపత్, అభి,వినోద్ గారు,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామి పనులను సద్వినియోగం చేసుకోవాలి

- అమీన్ పేట గ్రామ సర్పంచ్ డెక్క ఎల్లయ్య




**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని అమీన్ పేట గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ప్రవేశపెట్టిన,ఉపాధి హామీ పనులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అమీన్ పేట గ్రామ సర్పంచ్ డెక్క ఎల్లయ్య అన్నారు. మండలంలోని అమీన్ పేట గ్రామంలో ఉపాధి హామీ పనులను కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉపాధి పనుల్లో భాగంగా చెరువుల పూడికతీత,రోడ్ల నిర్మాణం, మొక్కలు నాటడం,నీటి పారుదల కాలువల వంటి పనులు చేపట్టవచ్చని, ఉపాధి కూలీలకు రోజుకు సగటున రూ.300వరకు ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. వేసవిలో పనుల ద్వారా స్థానికంగా ఉపాధి కల్పించి, వలసలను నివారించేందుకు ప్రభుత్వం ఉపాధి పనులకు శ్రీకారం చుట్టిందని, గ్రామస ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యాక్రమంలో ఉపసర్పంచ్ చిలుపూరి దయాకర్,వార్డు సభ్యులు లాలు,అరుణ,స్వప్న, కృష్ణవేణి, అశోక్,సుప్రియ,భాస్కర్ గ్రామస్తులు జానిమియ,పెద్ద యాకయ్య,ఓదేలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో యువత జాగ్రత్త : ఎస్ఐ మాలోత్ సురేష్




**తొలి అక్షరం/నర్సింహులపేట, ఏప్రిల్ 15 :** వేసవి సెలవుల్లో యువత జాగ్రత్తగా ఉండాలని నర్సింహుల పేట ఎస్ఐ మాలోత్ సురేష్ అన్నారు. ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి గ్రామాలలో సి సి ఫుటేజ్, హెల్మెట్ ధరించాలన్నారు. వేసవి సెలవుల్లో చెరువులు, వాగులు, బావులకు ఈతకు వెళితే యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో యువత స్నానం చేద్దామని దిగితే లోతు తెలియకుండా నీటిలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెలవు సమయాల్లో చెరువులు, కుంటల వైపు వెళ్లనీయకుండా పర్య వేక్షణ చేయాలని, వేసవి సెలవు సమయాల్లో క్రీడలు, డ్రాయింగ్ తదితర వాటిపై నైపుణ్యత ప్రదర్శించాలని, ఆ విధంగా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని ఎస్ఐ తెలిపారు..

## నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు

- తెలిపిన తోపునపల్లి సర్పంచ్ చాగంటి మమత -తిరుమల్.



**తొలి అక్షరం/నెక్కొండ ఏప్రిల్ 15:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన లావుడ్య తిరుమల్ చౌహాన్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన తోపనపల్లి గ్రామ సర్పంచ్ చాగంటి మమత– తిరుమల్, మాజీ సర్పంచ్ ఫకీర్ మియా, మరియు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాగంటి నారాయణ, వంగాల నాగిరెడ్డి, బొప్పిడి కిషన్ రెడ్డి, నీలకంఠం యాకయ్య,వల్లాజీ రాజు, వివిధ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## షాద్ నగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

- పాఠశాల ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా
- ముఖ్య అతిథిగా సీనియర్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పాండురంగయ్య




**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 15:** షాద్‌నగర్ భాగ్యనగర్ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా ఆధ్వర్యంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే విజయవంతంగా జరిగింది. ముఖ్య అతిథిగా సీనియర్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పాండురంగయ్య పాల్గొన్నారు.ప్రిన్సిపల్ రఫత్ సుల్తానా పాఠశాల సాధించిన విజయాలను, ఘనతలను చిన్నారులకు వివరించారు. ఈ విద్యా సంవత్సరం తమ తరగతులను పూర్తి చేసి పై తరగతులకు వెళ్లబోయే చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి, వారిలో ఉత్సాహాన్ని నింపారు.సందర్భంగా మాట్లాడిన పాండురంగయ్య , ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ముందుంచి బాగా చదువుతూ గొప్ప వారవ్వాలనే స్ఫూర్తిని రేకెత్తిస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, దేశభక్తి, జాతీయ భావాలు, మానవీయ విలువలను చిన్నారులకు అలవాటు చేయాల్సిన అవసరం ఉందని, దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. అప్పుడే వారు జీవిత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ఉత్తమ పౌరులుగా రూపొందుతారని చెప్పారు.యూకేజీ నుంచి ఒకటో తరగతి వరకు, ఐదో తరగతి నుంచి ఆరో తరగతి వరకు చిన్నారులకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## తెలుగు విశ్వవిద్యాలయంలో వైభవంగా 'మహనీయుల జయంతి' ఉత్సవాలు

- బాచుపల్లి ప్రాంగణంలో కొలువుదీరనున్న మేధావుల మేళా
- విచ్చేయనున్న ఆచార్య సూర్య ధనంజయ్
- సామాజిక చైతన్య స్ఫూర్తితో ఏర్పాట్లు పూర్తి చేసిన ఎస్.సి, ఎస్.టి, బి.సి సెల్స్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 15:** బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నేడు (ఏప్రిల్ 16న) సామాజిక విప్లవకారుల, మహనీయుల స్మరణతో మార్మోగనుంది. విశ్వవిద్యాలయ ఎస్.సి, ఎస్.టి మరియు బి.సి సెల్స్ సంయుక్త ఆధ్వర్యంలో "మహనీయుల జయంతి" ఉత్సవాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నారు. ఉదయం 10:30 గంటలకు విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య సూర్య ధనంజయ్ విచ్చేసి ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షత వహించనున్నారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ నటుడు మరియు మోటివేషనల్ స్పీకర్ కొండిపర్తి ప్రదీప్ రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి తొగర్ల చిరంజీవి మరియు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అకడమిక్ కౌన్సిలర్ పానుగంటి కృపాకర్ పాల్గొని మహనీయుల ఆశయాల ప్రాముఖ్యతను వివరించనున్నారు.స్ఫూర్తిదాయక వేదిక:సంత్ సేవాలాల్, సావిత్రిబాయి పూలే, స్వామి వివేకానంద, భాగ్యరెడ్డి వర్మ, సురవరం ప్రతాపరెడ్డి, బాబు జగ్జీవన్ రామ్, డా. బి.ఆర్. అంబేద్కర్, మరియు జ్యోతిరావు పూలే వంటి మహనీయుల త్యాగాలను, వారు సమాజానికి అందించిన దిశానిర్దేశాన్ని ఈ సందర్భంగా స్మరించుకోనున్నారు.ఈ మహోత్సవానికి విద్యార్థులు, మేధావులు మరియు భాషాభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సెల్ డైరెక్టర్ డా. విజయపాల్ పాత్లోత్ సాదరంగా ఆహ్వానిస్తున్నారు.

## వడదెబ్బ మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం: రేవంత్ సర్కార్ భరోసా

- భానుడి భగభగలకు ప్రాణ నష్టం జరిగితే సర్కార్ అండ
- మండల కార్యాలయాల్లో దరఖాస్తుకు అధికారుల సూచన
- పేద కుటుంబాల పాలిట వరంలా ముఖ్యమంత్రి నిర్ణయం: మర్ద హరికృష్ణ



**తొలి అక్షరం/ఇనుగుర్తి, ఏప్రిల్ 15:** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూనే, దురదృష్టవశాత్తూ వడదెబ్బతో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఎండల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా (పరిహారం) అందించనున్నట్లు ప్రకటించి బాధితులకు గొప్ప భరోసా కల్పించింది. **అవసరమైన పత్రాలు:** ఈ పరిహారం పొందాలనుకునే మృతుల కుటుంబ సభ్యులు మరణ ధృవీకరణ పత్రం, శవపరీక్ష నివేదిక, పోలీసు ఫిర్యాదు కాపీ, మృతుని ఆధార్ కార్డుతో పాటు వారసుల ఆధార్ వివరాలను సంబంధిత మండల రెవెన్యూ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు వెల్లడించారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హులైన వారికి ప్రభుత్వం నేరుగా పరిహారాన్ని మంజూరు చేయనుంది.ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంపై ఇనుగుర్తి మండల ఓబీసీ అధ్యక్షులు మర్ద హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో 45 డిగ్రీల ఎండలు మండుతున్న తరుణంలో పేద, బడుగు, బలహీన వర్గాల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఒక కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబానికి రూ. 4 లక్షల ఆర్థిక సాయం అందించడం అనేది ఆ కుటుంబానికి ఇచ్చే గొప్ప భరోసా. రేవంత్ సర్కార్ ఎల్లప్పుడూ సామాన్య ప్రజల పక్షాన నిలబడుతుందని ఈ నిర్ణయం మరోసారి నిరూపించింది. సంక్షోభ సమయంలో ప్రజలను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది."**జాగ్రత్తలు తప్పనిసరి:** ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హరికృష్ణ కోరారు. మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అయ్యప్ప ఆలయ భద్రతకు సదర్ శ్రీను సహకారం

- 8 సీసీ కెమెరాలు, ఎల్ఈడి స్క్రీన్ చేయూతన అందించడం అభినందనీయం
- ఆలయ కమిటీ సభ్యులు సదర్ శ్రీనుకు ఘన సన్మానం



**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 15:** నందిగామ మండలంలోని ప్రసిద్ధ అయ్యప్ప ఆలయం అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లవేళల అందిస్తామని సదర్ శ్రీను అన్నారు. బుధవారం గురుస్వామి గిరీష్ నాయర్ సమక్షంలో అయ్యప్ప స్వామి సన్నిధి ఆలయ అభివృద్ధిలో భాగంగా...రంగారెడ్డి జిల్లా బీసీ సేన అధ్యక్షుడు సదర్ శీను 8 సీసీ కెమెరాలు, ఎల్ఈడి టీవీ అమర్చారు. సుమారు రూ. 65 వేల విలువైన ఈ సౌకర్యాలు ఆలయ భద్రతను మరింత బలోపేతం చేశారు.అయ్యప్ప ఆలయానికి ఎంతో గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి తమ వంతు సహాయం ఎప్పటికీ కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఆలయానికి వచ్చే భక్తులకు సురక్షిత వాతావరణం కల్పించడమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశమని తెలిపారు.సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మౌలిక వసతుల కల్పనలో ముందుకు వచ్చి సహకరించడం ద్వారా ఆధ్యాత్మిక కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు.భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజానికి మార్గదర్శకాలు కావాలని, వాటి అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గురు స్వామి సదరు శీనుకు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల్ల బాల్ రెడ్డి, ఆలయ ట్రెజరర్ ఎదిరె శ్రీకాంత్ గౌడ్, కుమార్ గౌడ్, బి కృష్ణ యాదవ్, బి జంగయ్య గౌడ్, వార్డు సభ్యుడు కిట్టు, పలువురు పుర ప్రముఖులు అభినందించారు.

# ఒలంపియాడ్ స్టేట్ ర్యాంకులు కైవసం చేసుకున్న శ్రీ కాకతీయ హైస్కూల్ విద్యార్థులు

**● గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపిన శ్రీ కాకతీయ హైస్కూల్ ప్రిన్సిపాల్ స్వాతి రెడ్డి**






**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 15:** ఈ.అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 12వ రాష్ట్రస్థాయి అవార్డు ఫంక్షన్ ,భారతీయ విద్యా భవన్ హైదరాబాద్ తెలంగాణ అభ్యాసోత్సవ్‌కు హాజరు అయిన శ్రీ కాకతీయ హై స్కూల్ విద్యార్థులు.ఈ అభ్యాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్పనా చావ్లా స్టేట్ లెవెల్ పరీక్షలో 7 వ తరగతి కి చెందిన అన్విద్ రెడ్డి స్టేట్ 2 వ ర్యాంకు,9వాతరగతి కి చెందిన వైష్ణవి మరియు 6వ తరగతి కి చెందిన మాధురీ స్టేట్ 3వ ర్యాంకు లు సాధించారు,అలాగే స్టేట్ లెవెల్ ఒలంపియాడ్ లో 8వ తరగతి స్మితిక స్టేట్1 ర్యాంక్,6వ తరగతి అకిలేష్ మరియు 8వ తరగతి శాన్విక స్టేట్ 3వ ర్యాంకులు కైవసం చేసుకున్నారు,ఈ కార్యక్రమానికి దాదాపుగా 50 వేల మంది వివిధ పాఠశాల విద్యార్థులు,1000 మంది ఉపాధ్యాయులు మరియు యాజమాన్యం పాల్గొన్నారు.గెలుపొందిన విద్యార్థులకి శ్రీ కాకతీయ స్కూల్ ప్రిన్సిపల్ స్వాతి రెడ్డి అభినందించారు.

# ఇసుక మాఫియాపై మెరుపుదాడి

**● వంతడుపులలో 16 ట్రిప్పుల స్వాధీనం, అధికారుల కఠిన హెచ్చరిక!**



**తొలి అక్షరం/నర్సింహులపేట ఏప్రిల్ 15:** నర్సింహులపేట మండలంలోని వంతడుపుల స్టేజ్ వద్ద అక్రమ ఇసుక రవాణా, నిల్వలపై అధికారులు మెరుపుదాడి నిర్వహించి 16 ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకోవడం సంచలనం సృష్టించింది. ఇటీవల పెరుగుతున్న ఇసుక మాఫియా కార్యకలాపాలపై దృష్టి సారించిన రెవెన్యూ అధికారులు ఖచ్చితమైన సమాచారం మేరకు ఈ చర్య చేపట్టారు.తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకున్నారు. ఈ చర్యతో అక్రమ దందా నిర్వహిస్తున్న వారికి గట్టి హెచ్చరిక అందినట్టయింది. అధికారులు స్పష్టంగా చెప్పినట్టుగా, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇసుక రవాణా, నిల్వలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.స్వాధీనం చేసుకున్న 16 ట్రిప్పుల ఇసుకను భద్రపరిచే బాధ్యతతో పాటు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వంతడుపుల గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. స్థానిక ప్రజలు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి దాడులు కొనసాగించాలని కోరుతున్నారు.అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై కట్టడి కోసం అధికారులు మరింత కఠిన చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. మండలంలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనిస్తే వెంటనే సమాచారాన్ని అందించాలని ప్రజలను కోరారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు దిశగా మెరుగైన వైద్య సేవలు

**● నర్సింహులపేటలో ఎక్స్‌రే ప్రత్యేక శిబిరం ప్రారంభం**

**తొలి అక్షరం/నర్సింహులపేట, ఏప్రిల్ 15:** క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన జాతీయ కార్యక్రమంలో భాగంగా నర్సింహులపేట వైద్య సేవలు మరింత బలోపేతం అయ్యాయి. దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కవిత ఆదేశాల మేరకు ఈరోజు ఉదయం 10:30 గంటలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రత్యేక వైద్య శిబిరం ప్రారంభించారు.ఈ శిబిరంలో సుమారు 30 మంది రోగులకు రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆధునిక డిజిటల్ యంత్రంతో ఛాతి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పరీక్షల ఫలితాలు రేపటి రోజే అందజేసి, వాటి ఆధారంగా వెంటనే రోగులకు అవసరమైన చికిత్స ప్రారంభిస్తామని వైద్యాధికారి తెలిపారు.ఇలాంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, రేపు ఏప్రిల్ 16న పెద్ద నాగారం గ్రామంలో మరో శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో క్షయవ్యాధి సమన్వయకర్త అశోక్, నోడల్ సూపర్వైజర్ చలపతిరావు, సీనియర్ ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు సందీప్, మధ్యస్థాయి ఆరోగ్య సేవాధికారి అన్వేష్, రేడియోగ్రాఫర్ విజేందర్, ఎక్స్‌రే సాంకేతిక నిపుణుడు అరుణ్, సిబ్బంది కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు శ్రీలత, విజయ, స్వరూప, వెంకటలక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ నాణ్యమైన వైద్య సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆశాకిరణంగా మారుతున్నాయి.

# ఐక్యంగా పోరాటం చేద్దాం రండి కదలి రండి..



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 16:** 1994 సంవత్సరంలోరామన్నపేట అభివృద్ధి కోసం మాజీ మంత్రివర్యులు ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి గారి సహకారంతో స్థానిక శాసనసభ్యులు గుర్రం యాదగిరి రెడ్డి గారు రామన్నపేట షాపింగ్ కాంప్లెక్స్ భూమి పూజ కార్యక్రమం చేయడం జరిగినది. 1952 నుంచి 2008వరకు రామన్నపేట నియోజకవర్గాన్ని పరిపాలించిన ప్రతి శాసనసభ్యులు రామన్నపేట ను అభివృద్ధి పరచడంలో ముందు వరుసలో ఉన్నారు ఆనాటి నుంచి నేటి వరకు అభివృద్ధి జరుగుతున్నది.ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రామన్నపేట నియోజకవర్గానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నది. మండల వ్యాప్తంగా ఉన్న పెద్దలు యువకులు అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు పాత్రికేయ మిత్రులు వ్యాపారవేత్తలు విద్యావేత్తలు విద్యావంతులు సకల జనులు అందరూ కలిసి ఏకతాటిపై వచ్చి రామన్నపేట నియోజకవర్గాన్ని సాధించుకుందాంరా.. కదలిరా..రండి.. కదలి రండిగల్లీ నుండి ఢిల్లీకి బయలుదేరుదాం....

# అంబేద్కర్ జయంతి రోజు దళిత మహిళపై దాడి

**● దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి: జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయశ్రీకాంత్**






**తొలి అక్షరం/జిల్లెడు చౌదరి గూడ, ఏప్రిల్ 15:** జిల్లెడు చౌదరి గూడ మండల పరిధిలోని ఎదిర గ్రామంలో అంబేద్కర్ జయంతి వంటి పుణ్యదినాన దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ దళిత మహిళపై కొందరు వ్యక్తులు అమానుషంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన స్థానికంగా ఆందోళనకు గురి చేసింది. మహిళ అని కూడా చూడకుండా కర్కాశంగా వ్యవహరించిన దుండగుల చర్యలను ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు.ఈ ఘటనపై స్పందించిన జాతీయ బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయశ్రీకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి రోజునే ఇలాంటి దాడులు జరగడం సమాజానికి మచ్చతెచ్చే చర్యగా ఆమె పేర్కొన్నారు.బాధితురాలికి న్యాయం చేయాలని, దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే, దళితులపై జరుగుతున్న అణచివేతలను ప్రభుత్వం కఠినంగా అరికట్టాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు తగిన పరిహారం ఇవ్వాలని కూడా కోరారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.స్థానిక ప్రజా సంఘాలు, హక్కుల సంస్థలు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

# బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించిన సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్



**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 15:** ఫరూక్ నగర్ మండలం, గిరాయ గుట్ట తండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం భారత రాజ్యాంగ నిర్మాత భీమ్ రావు రాంజీ జయంతి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్ మాట్లాడుతూ అంబేద్కర్ గారి బాల్యం గురించి, ఆతని విద్యాభ్యాసం గురించి, ఆయన ఉన్నత విద్యా గురించి,అడుగడుగున అనుభవించిన అవమానాలగురించి , తన కుటుంబ విషయాల గురించి ఎంతో ఆసక్తి కర విషయాలు చెబుతూ మనిషి అనుకుంటే దేనైనా సాధించ గలడు బి ఆర్ అంబేద్కర్ గారు ఒక వ్యక్తి కాదు ఒక శక్తి ప్రపంచ దేశాలకే ఆదర్శ పురుషుడు ఈ రోజు భారత దేశం గర్వించ దగ్గ దేశంలో అన్నివర్గాల ప్రజలకు దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో మంచి మార్గాన్ని సూచించాడని చెప్పడం జరిగినదనీ అతని జయంతి నీ మనం జరుపుకోవడం ఎంతో ఆనందమని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణి హరి నాయక్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు రాజు, మౌనిక రమేష్, సీనియర్ నాయకులు మంగులాల్, అంగన్వాడీ టీచర్ లక్ష్మమ్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

# జానంపేట అంబేద్కర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ అధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు**

**వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా క్షేత్ర సేవ ప్రముఖ్ బండారి రమేష్**

**లైఫ్ కేర్ హాస్పిటల్ డా. గోలేపు కార్తికేయ, డా. మల్లిక**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 15:** బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా షాద్ నగర్ మున్సిపాలిటీ 15 వ వార్డ్ లో విశ్వహిందూ పరిషత్ సేవా విభాగం అధ్యర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరం లో షాద్ నగర్ పట్టణానికి చెందిన లైఫ్ కేర్ హాస్పిటల్ ఎంబీబీఎస్ జనరల్ మెడిసిన్ డా. గోలెపు కార్తికేయ, ఎంబీబీఎస్ ఎండి పాథాలజీ డాక్టర్ మల్లిక ఈ వైద్య శిబిరంలో పేదలకు, అనారోగ్యంగా ఉన్నవారికి ఉచితంగా వైద్యాన్ని అందించి వారికీ టెస్టులు, మరియు ఉచితంగా కావాల్సిన మందులు అందజేశారు. ఈ సందర్బంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన విశ్వహిందూ పరిషత్, తెలంగాణ మఠం మందిర్ ప్రముఖ్ మఠం రాచయ్య మరియు కౌన్సెలర్ మరియా బేగం సాదిక్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని పేదల కొరకు ఉచితంగా వైద్యం అందించాలనే నేపథ్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరం లో విశ్వహిందూ పరిషత్ సేవా విభాగం క్షేత్ర సేవా విభాగ్ అధ్యక్షులు బండారి రమేష్, తెలంగాణ ప్రాంత మఠ మందిర్ ప్రముఖ్ మఠం రాచయ్య, 15 వ వార్డ్ కౌన్సెలర్ మరియాబేగం సాదిక్, బిజినెపల్లి రంగయ్య, రిటైర్డ్ హెడ్మాస్టర్ భాగ్యవతి, కోటేష్, జంగా తిరుపతి, పద్మనాభం, నారాయణ మూర్తి, మహేష్, శ్రీను, సందీప్, వెంకటేష్ గౌడ్, ఆంజనేయులు, నాగేశ్వర్, బుచ్చయ్య, మరియు డాక్టర్ శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అర్రివ్ ఏలైవ్ క్యాంపెయిన్ 2006 ప్రోగ్రాం




**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 16:** జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, ఐపీఎస్ ఆదేశానుసారం రామన్నపేట మండలం లో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లోని విద్యార్థులు లతో సుభాష్ విగ్రహం, రామన్నపేట లో మానవహారం నిర్వహించి వారికి హెల్మెట్ , సీటు బెల్ట్ త్రిబుల్ డ్రైవింగ్, మద్యం త్రాగి వాహనాలు నడపకూడదని వారి తల్లి తండ్రి కి తెలియజేయాలని చెప్పడం జరిగింది ఇంకా స్కూల్ పిల్లలతో "డాడ్ ప్లీజ్ బై ఏ హెల్మెట్ ఫర్ మీ అండ్ మామ్ " వ్యాస రచన నిర్వహించడం జరిగినది. ఎన్.వెంకటేశ్వర్లు, సీఐ రామన్నపేట సర్కిల్,డి. నాగరాజు, ఎస్సై రామన్నపేట ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొనినారు.

# దళిత రత్న అవార్డు అందజేత



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 16:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న దళిత రత్న అవార్డులను హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రధానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేస్తూ మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జరుగుతున్న వివిధ సామాజిక ఉద్యమాలలో పాల్గొంటున్న ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ కి దళిత రత్న అవార్డు అందుకున్న సందర్భంగా వారికి హార్దిక శుభాకాంక్షలు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపినారు

# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత జావేద్ మృతి

**- తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఎంపీ రఘురాం రెడ్డి**

**తొలి అక్షరం/ఖమ్మం ఏప్రిల్ 15:** ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ బుధవారం సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారన్న విషయం తెలుసుకొని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మైనార్టీ నేతగా, కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన నాయకుడిగా పనిచేసిన మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జావేద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ.., ఈ తీరని దుఃఖాన్ని తట్టుకునే శక్తి వారికి ప్రసాదించాలని, తన ప్రగాఢ సంతాపం తెలిపారు.



# రామన్నపేట చరిత్ర..

తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 15:రామన్నపేట చారిత్రక నేపథ్యం... ఇంద్రపాలనగరం ప్రస్తుతం తుమ్మలగూడెం విష్ణు కుండీలు ఈ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించినరని పురాతన కట్టడాలు శాసనాలు తెలుపుతున్నాయి. పరిపాలన. పరిమాణం. 2016 జిల్లాల పునర్విభజన కి ముందు నల్గొండ జిల్లాలో ఉండేది ప్రస్తుతం యాదాద్రి జిల్లాలో రామన్నపేట మండలంలో కొనసాగుతున్నది. **రాజకీయ చరిత్ర..**1952లో ఏర్పడిన రామన్నపేట శాసనసభ నియోజకవర్గం 2008లో రామన్నపేట నియోజకవర్గం రద్దు అయినది. 2009లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నకిరేకల్ నియోజకవర్గం లో ఒక మండలం గా కలపడం జరిగింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నకిరేకల్ నియోజకవర్గంలో మండల కేంద్రంలో కొనసాగుతున్నది.రామన్నపేట శాసనసభకు 1952లో పిడిఎఫ్ అభ్యర్థి కాపు రామచంద్రారెడ్డి మొదటి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించినారు. 2004లో చివరి ఎమ్మెల్యేగా ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి 2009 వరకు కొనసాగినారు. మొత్తం 13 సార్లు ఎన్నికలు జరగగా. పిడిఎఫ్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ ఐ నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు సిపిఐ పార్టీ నుంచి నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించినారు. 1971లో కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో 1973లో జలగం వెంగళరావు మంత్రివర్గంలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ఈ నియోజకవర్గం నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహించినారు. 1981లో టి అంజయ్య మంత్రివర్గంలో కొమ్ము. పాపయ్య యాదవ్ ఈ నియోజకవర్గం నుంచి మంత్రిగా ప్రాతినిధ్యం వహించినారు. మొత్తం ఈ నియోజకవర్గాన్ని ఎనిమిది సార్లు రెడ్లు పరిపాలించగా బీసీలు రెండుసార్లు పరిపాలించినారు ఎస్సీలు మూడుసార్లు ఈ ప్రాంతాన్ని పరిపాలించినారు. 2009 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నకిరేకల్ నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యేగా చిరుమర్తి లింగయ్య ప్రాతినిధ్యం వహించినారు. 2014 తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మొదటి ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గం నుంచి వేముల వీరేశం మొదటి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించినారు. **ఈ ప్రాంత ప్రముఖులు..**ప్రముఖ రచయిత పద్మశ్రీ అవార్డు గ్రహీత విఠలాచార్యహైకోర్టు న్యాయమూర్తికునూరు లక్ష్మణ్ గౌడ్పెందోట శ్రీనివాస్ హైకోర్టు న్యాయమూర్తి**భౌగోళిక పరిస్థితులు...** హైదరాబాద్ కు 75 కిలోమీటర్ల దూరంలోఉత్తరాన నల్గొండకు 36 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. **పర్యాటక ప్రాంతాలు...**సాంప్రదాయక రాజభవనం అయినా అలీ సాహెబ్ హిల్స్ అనే పర్యాటక ప్రాంతం అలీ సార్ గుట్ట ఈ ప్రాంతంలో ప్రసిద్ధి చెందినది. **సమీప మండలాలు...**దక్షిణాన చిట్యాల 8 కిలోమీటర్ల దూరంఉత్తరాన వలిగొండ 13 కిలోమీటర్ల దూరంతూర్పున నార్కట్పల్లి 16 కిలోమీటర్ల దూరంపశ్చిమాన చౌటుప్పల్ 24 కిలోమీటర్ల దూరం మండలాలు కలవు**రవాణా సౌకర్యం...** నల్గొండ నుంచి రామన్నపేట వరకు భువనగిరి నుంచి రామన్నపేట వరకు బస్సు సౌకర్యం కలదు.రైల్వే మార్గం.. సికింద్రాబాద్ నుంచి రామన్నపేట రైల్వే స్టేషన్ వరకు 72



కిలోమీటర్లుసమీప రైల్వే స్టేషన్లో వలిగొండ చిట్యాల. ప్రస్తుతం ఆగుతున్న రైలు నారాయణాద్రి. రేపల్లె. పల్నాడు. డెమో. రైల్వే సౌకర్యం కలదు. **కోర్టులు...**రామన్నపేటలో మున్సిపల్ కోర్టుజూనియర్ సివిల్ కోర్టు **అడిషనల్ అదనపు కోర్టు** హైకోర్టు న్యాయమూర్తి కునూరు లక్ష్మణ్ గౌడ్ కృషి వలన ఈ ప్రాంతానికి జిల్లా అదనపు కోర్టు మంజూరు అయినది.**నీటి వనరులు....** 19శ4 సంవత్సరంలో నాటి నిజాం ఆసిఫ్ నగర్ ప్రధాన కాలువ ద్వారా వలిగొండ మండలం నెమలి కాల్వ వద్ద మూసీ నదిపై ఆనకట్ట నిర్మించి కాలువ తవ్వించినారు మొదటగా ఈ కాలువ మార్గం ఇంద్రపాలనగరం చెరువు లోనికి అక్కడ నుంచి లక్ష్మాపురం శోభనాద్రిపురం నీర్నంల దుబ్బాక మునిపంపుల పల్లివాడ ఎన్నారం గ్రామ చెరువులు కుంటలు బావులు చెరువులు నిండుతూ ముందుకు సాగుతుంది.. పల్లివాడ గ్రామంలో మూసీ నదిపై ఆనకట్ట ద్వారా బాచుపల్ సూరారం కుంకుడు పాముల బీ.తుర్కపల్లి నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు సుమారు పదివేల ఎకరాలు ఈ ప్రాంతంలో పంటలు పండుతాయి. లక్ష్మాపురం ఏటి కాలువ ద్వారా సుమారు రెండువేల ఎకరాలు ఈ ప్రాంతంలో పంటలు పండుతాయి.ధర్మారెడ్డి పల్లి పిల్లాయి పల్లి పాత రాచ కాలువ నిర్మాణం పూర్తి అయితే. సర్నేను గూడెం వెల్లంకి సిరిపురం రామన్నపేట కొమ్మాయిగూడెం జనంపల్లి ఇస్కిల్లా ఉత్త టూరు గ్రామాల్లో సుమారు 8000 నుంచి 10000 ఎకరాలు పంట సాగు అయ్యే అవకాశాలు పూర్తిగా ఉన్నాయి. కాళేశ్వరం కాలువ ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతంలో అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.**ప్రభుత్వ కార్యాలయాలు...**నియోజకవర్గానికి కావలసిన అన్ని రకాల సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ బిల్డింగులతో కూడిన.. మండల పరిషత్ కార్యాలయం. తాసిల్దార్ కార్యాలయం. ఎస్ టి ఓ కార్యాలయం. సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం. ఎంఈఓ కార్యాలయం. పోస్ట్ ఆఫీస్ కార్యాలయం. సబ్ రిజిస్టర్ కార్యాలయం. టీటీడీ కళ్యాణ మండపం. లేబర్ ఆఫీస్ కార్యాలయం. అగ్రికల్చర్ ఆఫీస్ కార్యాలయం. 30 ఎకరాలతో కూడిన వ్యవసాయ మార్కెట్ కార్యాలయం. సింగిల్ విండో కార్యాలయం. ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కాలేజీలు. 52 పడకలతో కూడిన ఏరియా హాస్పిటల్. రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల. ప్రైవేట్ డిగ్రీ జూనియర్ కళాశాలలు. చెక్ పోస్ట్ ఆఫీస్. ప్రభుత్వ ప్రవేట్ రంగాల బ్యాంకుల సౌకర్యాలతో కూడిన సుమారు 8 బ్యాంకులు. రామన్నపేట పట్టణ కేంద్రంలో ఉండడం. గొప్ప విషయం.ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గ పునర్విభజన అంశాన్ని ముందుకు తీసుకొని రామన్నపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయడం కొరకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం చాలా గొప్ప విషయమని. గత సంవత్సరం జూన్ 25 2025 ఈ ప్రాంత బిడ్డలు రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఏర్పాటు చేసుకొని అనేక కార్యక్రమాలతో అందరినీ కలుపుకొని ముందుకు సాగడం రామన్నపేట నియోజకవర్గం సాధించడమే లక్ష్యంగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు అటెండర్ నుంచి అధికార వరకు ఎమ్మెల్యే నుంచి మంత్రి వరకు కేంద్ర మంత్రి నుంచి రాష్ట్ర మంత్రి వరకు రామన్నపేట నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతుండడం చాలా గొప్ప విషయం..

# మా ప్రాజెక్టు గాలికి.. మా నీళ్లు నల్లగొండకు..

**పాలమూరుకు తీరని అన్యాయం చేస్తారా..**

**బీఆర్ఎస్ హయాంలో పాలమూరుద**

**-రంగారెడ్డి కలలు కల్లలే..**

**కాంగ్రెస్ వచ్చాక కూడా అదే పరిస్థితి..**

**అందుకే ఉద్యమించాలని నిర్ణయించాం..**

**పాలమూరు ప్రాజెక్టుల ఉద్యమ వేదిక చైర్మన్ రాజేందర్ రెడ్డి, పాలమూరు ఉద్యమ వేదిక కన్వీనర్ రాఘవులు రాజేందర్**

**షాద్ నగర్‌లో పాలమూరు ఉద్యమ వేదిక మీడియా సమావేశం**

**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 15:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను గాలికి వదిలేసారు.. మరోవైపు దుందుభి నది వద్ద ప్రాజెక్టు ద్వారా పాలమూరు జిల్లా నీళ్లను నల్లగొండ జిల్లాకు తరలిస్తున్నారు.. ఇదెక్కడి న్యాయం.. బీఆర్ఎస్ ఎలాగూ అన్యాయం చేసింది.. కాంగ్రెస్ హయాంలోనూ ఇదే పరిస్థితి.. అందుకే ఉద్యమించాలని నిర్ణయించాం.. పాలమూరు ప్రాజెక్టును సాధించేదాకా పోరాటం కొనసాగిస్తాం.. అని పెండింగ్ ప్రాజెక్టుల ఉద్యమ వేదిక చైర్మన్ రాజేందర్ రెడ్డి, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవులు అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో




వారు మాట్లాడుతూ రెండు రోజులుగా పాలమూరు జిల్లా ప్రాజెక్టులన్నీ తిరుగుతున్నామని, బుధవారం లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం ఎంపిక చేసిన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించామని తెలిపారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయినట్లు నాయకులు చెబుతున్నారని, కానీ 10 శాతం కూడా ఇంకా పూర్తి కాలేదని ఆరోపించారు.షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ మీద ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు. మరోవైపు దిండి నుంచి నీటిని నల్గొండ జిల్లాకు తరలిస్తూ పాలమూరుకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోజు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని మాట ఇచ్చిన కేసీఆర్ మాట తప్పి ఉత్తరాది వైపు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై దృష్టి సారించారని, అందుకే ఆయనను ఓడించి పాలమూరు జిల్లాలో ఒక్క సీటు కూడా రాకుండా చేయగలిగామని గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాట్లు పాలమూరు జిల్లా ది కీలకపాత్ర అయినప్పటికీ ఇప్పటిదాకా ప్రాజెక్టుల విషయంలో శ్రద్ధ చూపకపోవడం దారుణమని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పునరుద్ధరించడమే లక్ష్యంగా తమ వేదిక పనిచేస్తుందని వెల్లడించారు. ఒకవేళ ప్రభుత్వం మాట తప్పితే తెలంగాణ ఉద్యమాన్ని ఎలా ఉధృతం చేశామో, ఈ ఉద్యమాన్ని కూడా అదే స్థాయిలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇకనైనా దీనిని దృష్టిలో పెట్టుకొని పాలమూరు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఉద్యమ వేదిక నాయకులు టీజీ శ్రీనివాస్,వి. రామారావు, సుధాకర్ రెడ్డి, హనీఫ్, తిమ్మప్ప, ఖలీల్, సాయిబాబా, చేన్న కిష్టన్న, మందారం నరసింహులు, రామచందర్, గొర్ల రాము, ఆకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జర్మనీలో ఘనంగా తెలుగు వెలుగు 20వ వార్షికోత్సవ వేడుకలు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),ఏప్రిల్15:**జర్మనీలోని భారతీయ ప్రవాసుల ప్రతిష్టాత్మక సంస్థ తెలుగు వెలుగు జర్మనీ (టీవీజీ) ఈవి తన ప్రస్థానంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. సంస్థ స్థాపించబడి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 11, 2026న 20వ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించింది. 800 మందికి పైగా ప్రవాసులు హాజరైన ఈ వేడుక ఐక్యతకు, తెలుగు సంస్కృతి పరిరక్షణకు అద్దం పట్టింది. ముఖ్య అతిథులుగా భారత కాన్సుల్ జనరల్, మేయర్ ఈ వేడుకలకు భారత కాన్సుల్ జనరల్ శ్రీమతి సుచిత కిశోర్ గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 20 ఏళ్ల మైలురాయిని చేరుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, సమాజానికి సంస్థ అందిస్తున్న సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. మరో విశిష్ట అతిథి, లాంగెన్ నగర మేయర్ శ్రీ జాన్ వెర్నర్, తెలుగు సమాజం అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. అంతేకాకుండా, లాంగెన్‌లో క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. టీవీజీ అధ్యక్షుడు శ్రీ ప్రభంజన్ గాదెల, ప్రధాన కార్యదర్శి శ్రీ సూర్య ప్రకాశ్ వెలగాలు కాన్సులేట్ అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.సంస్థ పునాదులు వేసిన దివంగత సాయి రెడ్డి ని, అలాగే వ్యవస్థాపక బృందాన్ని ఈ వేదికపై వారు స్మరించుకుంటూ ఘన నివాళులర్పించారు. **హోరెత్తిన సంగీతం ఆరటాకు విందు:** వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.ప్రముఖ టాలీవుడ్ సంగీత దర్శకుడు శ్రీ కోటి నేతృత్వంలో సాగిన సంగీత కచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకులను ఉర్రూతలూగించింది.అలాగే తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వడ్డించిన అచ్చమైన ఆరటాకు విందు అతిథులకు మన ఊరి జ్ఞాపకాలను గుర్తు చేసింది. ఈ కార్యక్రమంలో టీవీజీ అధ్యక్షుడు ప్రభంజన్ గాదెల, ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాశ్ వెలగా, కోశాధికారి ఆదర్శ్ వంగల, సాంస్కృతిక కార్యదర్శి ప్రీతమ్ బోడా విట్టల్, మీడియా అడ్మిన్ ఆనంద్ మహంకాళి, సంయుక్త కార్యదర్శి శశి, నిర్వాహక సభ్యులు సురేష్ పురం,సాయి చరణ్,శారద,హరి,కవితా నాదెళ్ల,శాంతి తాడేపల్లి, నీహారిక, సింధు,వినయ్ తదితరులు పాల్గొన్నరు.

# మా గోడు వినండి.. విద్యుత్ కార్మికులపై కరుణించండి

**- ఎనిమిదో రోజుకు చేరిన ఆర్టిజన్ల సమ్మె**

**- ప్రభుత్వ మొండివైఖరిపై ధ్వజం**

**- తొర్రూర్ డివిజన్ జేఏసీ చైర్మన్ పసుపులేటి మధు**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో-తొర్రూర్ ప్రతినిధి(సాంబ పస్తం),ఏప్రిల్15:** మా గోడు వినండి ఇప్పటికైనా యాజమాన్యం కనికరించి విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి అని తొర్రూర్ డివిజన్ జేఏసీ చైర్మన్ పసుపులేటి మధు డిమాండ్ చేశారు. టీవీఏఈజేఏసీ ఆధ్వర్యంలో తొర్రూర్ డివిజన్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎనిమిది రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా యాజమాన్యం చర్చలకు పిలవకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు.ప్రభుత్వం, యాజమాన్యం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. **భయపడొద్దు.. పోరాటం కొనసాగిద్దాం:** సమ్మెపై యాజమాన్యం ఇచ్చే షోకాజ్ నోటీసులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మధు కార్మికులకు భరోసా ఇచ్చారు.మేము ముందుగానే సమ్మె నోటీసు ఇచ్చాం.లేబర్ కమిషనర్ ఈ నెల 17న చర్చలకు పిలిచారు.ఈ లోపు యాజమాన్యం ఇచ్చే ఎలాంటి నోటీసులైనా చట్టబద్ధంగా చెల్లవు అని ఆయన స్పష్టం చేశారు. **కార్మికుల ప్రధాన డిమాండ్లు:** ఈ సమ్మెకు సంఘీభావం తెలిపిన సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ...విద్యుత్ రంగంలో కీలకమైన ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.**వారి ప్రధాన డిమాండ్లు ఇవే: ఆర్టిజన్ కార్మికులకు:** విద్యార్హతను బట్టి పోస్టుల కన్వర్షన్ (మార్పు) చేయాలి. **అన్‌మ్యాన్డ్ కార్మికులకు:** అందరినీ రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకొని కనీస వేతనం అందించాలి. **కారుణ్య నియామకాలు:** విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. **పీస్ రేట్ కార్మికులకు:** మిగిలిపోయిన అందరినీ తక్షణమే రెగ్యులర్ చేసి, జీవో నెం.11 ప్రకారం వేతనాలు చెల్లించాలి. **నిబంధనల అమలు:** విద్యుత్ సంస్థలో ఏపీఎస్ఈబీ పాత రూల్స్ వ్యవస్థను యథాతథంగా అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి ప్రభుత్వని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ మచ్చ సతీష్, డివిజన్ కన్వీనర్ బంధారపు శ్రీను,కో-చైర్మన్ నాగరాజు, కో-కన్వీనర్లు రమేష్,ఖాజాబీ,నాయకులు సునీల్ కుమార్, చంద్రప్రకాష్, జ్యోతి, సంధ్య, సుభాష్, ఖాజాపాషా, శంకర్, బిక్కు,బిచ్చ



నాయక్,అశోక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరులో ప్రజా పాలన ప్రగతి సమావేశానికి ఆహ్వానం



**తొలి అక్షరం/కల్లూరు, ఏప్రిల్ 15:** మండలంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 16న గురువారం ఉదయం ముఖ్య సమావేశం నిర్వహించ బడుతుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కల్లూరు రైతు వేదికలో మండల స్థాయి కార్యక్రమం జరగనుంది. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అలాగే త్వరలో ప్రవేశపెట్టబోయే కొత్త పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించనున్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు పై సమీక్ష కూడా జరగనుంది. ఈ కార్యక్రమానికి సర్పంచులు, గ్రామ పంచాయతీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆహ్వానించారు. ప్రజా పాలనను గ్రామ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమావేశం కీలకంగా మారనుంది.

# 'పెద్ది' జూన్‌కు వాయిదా..
## కారణమేంటో చెప్పిన మేకర్స్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదల మరోసారి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఏప్రిల్ 30న విడుదల కావాల్సిన ఈ సినిమాను జూన్ నెలలో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ బుధవారం అధికారికంగా ప్రకటించింది.

సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, కేవలం ఒక పాట చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉందని చిత్రబృందం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే సినిమా ఎడిట్ ప్రింట్ చూసుకున్నామని, అవుట్‌పుట్ పట్ల చాలా సంతోషంగా ఉన్నామని పేర్కొంది. "ప్రేక్షకులకు అత్యుత్తమ థియేటర్ అనుభవాన్ని అందించాలనేదే మా లక్ష్యం. అద్భుతమైన కంటెంట్‌ను అంతే గొప్పగా ముస్తాబు చేసేందుకు, పోస్ట్ ప్రొడక్షన్, టెక్నికల్ టీమ్స్‌కు మరికొంత సమయం ఇవ్వాలనుకుంటున్నాం. వారి నైపుణ్యంతో సినిమాను పరిపూర్ణంగా తీర్చిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని నిర్మాతలు వివరించారు.

సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న అద్భుతమైన స్పందనకు ధన్యవాదాలు తెలిపిన చిత్రబృందం, అభిమానుల సహకారానికి కృతజ్ఞతలు చెప్పింది. రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. జూన్‌లో కచ్చితమైన విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మేకర్స్ స్పష్టం చేశారు.

# ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్ బాహుబలి
## భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి

రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నెసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి



దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ. 120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# మైమరపిస్తున్న భాగ్యశ్రీ..



సినిమా ఇండస్ట్రీలో ఒక్కోసారి అదృష్టం చిత్ర విచిత్రంగా ఉంటుంది. కొందరికి వరుస హిట్లు వచ్చినా గుర్తింపు ఉండదు, కానీ మరికొందరికి ఒక్క సక్సెస్ లేకపోయినా విపరీతమైన క్రేజ్ వస్తుంది. సరిగ్గా ఇదే బాటలో సాగుతోంది యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే. టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన అతి తక్కువ కాలంలోనే తన అందం, అభినయంతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ మరాఠీ భామ, ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. అసలు ఈమె ఫేట్ మార్చబోయే ఆ కొత్త ప్లాన్ ఏంటి? ఆ విశేషాలు చూద్దాం.. మిస్టర్ బచ్చన్‌తో ఎంట్రీ.. హిట్టు లేకున్నా క్రేజ్: భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, భాగ్యశ్రీకి మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను కట్టిపడేశాయి. ఆ తర్వాత 'కింగ్డమ్', 'కాంత', 'ఆంధ్ర కింగ్' వంటి చిత్రాల్లో నటించినా, ఇప్పటివరకు ఈ బ్యూటీ ఖాతాలో ఒక్క గట్టి బ్లాక్‌బస్టర్ కూడా పడలేదు. అయినప్పటికీ, స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు మాత్రం ఈమెను వెతుక్కుంటూ వస్తుండటం విశేషం. పక్కింటి అమ్మాయి నుంచి గ్లామర్ డాల్‌గా: ఇప్పటివరకు భాగ్యశ్రీ బోర్సే ఎక్కువగా పక్కింటి అమ్మాయి తరహా పాత్రల్లోనే కనిపించింది. అయితే, కేవలం అవే పాత్రలు చేయడం వల్ల తన కెరీర్ ఆశించిన స్థాయిలో ఊపందుకోవడం లేదని ఈ బ్యూటీ గ్రహించినట్లు సమాచారం. ఇక అందుకే ఇప్పుడు తన రూట్ మార్చాలని నిర్ణయించుకుంది. ఇకపై కేవలం నటనకే పరిమితం కాకుండా, గ్లామర్ విషయంలో కూడా డోస్ పెంచాలని ఫిక్స్ అయిందట. తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసేందుకు ఈ మరాఠీ సుందరి సిద్ధమవుతోంది.



# 'టాక్సిక్' వాయిదాపై క్లారిటీ..
## పుకార్లకు చెక్ పెట్టిన చిత్రం యూనిట్

రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' విడుదల మళ్ళీ వాయిదా పడిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చిత్రం బృందం తీవ్రంగా ఖండించింది. ముందుగా ప్రకటించినట్టుగానే జూన్ 4, 2026న సినిమా కచ్చితంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అభిమానులు ఆందోళన చెందవద్దని కోరింది.

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చిత్రం యూనిట్ తెలిపింది. ఈ వదంతులకు చెక్ పెడుతూ, హీరో యశ్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్మాత్మక 'సినిమాకాన్' ఈవెంట్‌లో ఆయన పాల్గొని, 'టాక్సిక్' అంతర్జాతీయ ప్రమోషన్లను ప్రారంభించారు.

ఈ పర్యటనలో యశ్ 'టాక్సిక్'తో పాటు తాను నటిస్తున్న మరో భారీ చిత్రం 'రామాయణ' ప్రమోషన్ల బాధ్యతలను కూడా చూసుకుంటున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'రామాయణ'లో యశ్ రావణుడి పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఒకవైపు 'టాక్సిక్' విడుదల పనులు, మరోవైపు 'రామాయణ' ప్రమోషన్లతో యశ్ బిజీగా గడుపుతుండటంతో, వాయిదా వార్తలకు బలం లేదని స్పష్టమవుతోంది.



# టాలీవుడ్‌లో సమ్మె సైరన్
## : మే 1 నుంచి థియేటర్ల బంద్‌కు సిద్ధం



తెలుగు సినీ పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల (థియేటర్ యజమానులు) మధ్య నెలకొన్న వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఆదాయంలో వాటా (రెవెన్యూ షేరింగ్) విషయంలో ఇరు వర్గాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో మే 1వ తేదీ నుంచి తెలంగాణ వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లను నిరవధికంగా మూసివేయాలని ఎగ్జిబిటర్ల సంఘం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సమ్మర్ సీజన్‌లో విడుదల కావాల్సిన పలు క్రేజీ సినిమాల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.ప్రస్తుతం ఉన్న రెంటల్ పద్ధతి వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని థియేటర్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిర్వహణ ఖర్చులు, ఓటీటీల ప్రభావంతో ప్రేక్షకుల సంఖ్య తగ్గడంతో థియేటర్లు నడపడం కష్టంగా మారిందని వారు చెబుతున్నారు. అందుకే, మల్టీప్లెక్స్‌ల తరహాలో వసూళ్లలో మొదటి వారం 60 శాతం రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం వాటా ఇచ్చేలా కొత్త రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే, ఈ ప్రతిపాదనను యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ (టాఫ్పీ+) వ్యతిరేకిస్తోంది. ఇప్పటికే నిర్మాణ వ్యయాలు విపరీతంగా పెరిగాయని, ఈ సమయంలో రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేస్తే నిర్మాతలు మరింతగా నష్టపోతారని వారు వాదిస్తున్నారు. ఏప్రిల్ 30లోగా ఈ సమస్య పరిష్కారం కాకపోతే సమ్మె ఖాయమని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు.

ఒకవేళ సమ్మె జరిగితే మే నెలలో విడుదల కావాల్సిన నిఖిల్ 'స్వయంభూ', సమంత 'మా ఇంటి బంగారం', 'కొరియన్ కనకరాజు', 'సూర్య కరుప్పు' వంటి చిత్రాలపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ వివాదానికి త్వరగా ముగింపు పలకాలని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

# అంబేద్కర్ ఆశయ సాధనే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్
- రవీంద్రభారతిలో ఘనంగా 135వ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు
- ఐదుగురు ప్రముఖులకు 'దళిత రత్న' పురస్కారాల ప్రదానం



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),ఏప్రిల్15:** అంటరానితనం,సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని ఆయన చూపిన బాటలో నడుస్తూ దళిత, సంచార జాతుల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి,ఉత్సవ కమిటీ చైర్మన్ అట్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రవీంద్రభారతి వేదికగా జరిగిన 135వ భారతరత్న బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సమాజ సేవలో తరించిన ఐదుగురు ప్రముఖులకు ఆయన చేతుల మీదుగా 'దళిత రత్న' పురస్కారాలను అందజేశారు. అణగారిన వర్గాల కోసం, ముఖ్యంగా సంచార జాతుల కోసం విశేష కృషి చేస్తున్న వారిని గుర్తించి గౌరవించుకోవడం మన బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు.బేడ(బుడగజంగాల వంటి కులాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని హామీ ఇచ్చారు. **సేవా దృక్పథం అభినందనీయం:** 'దళిత రత్న' అవార్డులు అందుకున్న కిన్నెర యాదగిరి, చిత్తారి వెంకటయ్య,అడ్వకేట్ విభూతి వెంకటేశ్వర్లు, చిత్తారి గురుపాదం,ఉర రామకృష్ణ ల సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం.ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు సేవ చేయడం,న్యాయవాదులుగా బాధితులకు అండగా నిలబడటం అభినందనీయం అని మంత్రి కొనియాడారు. **ఘనంగా సత్కారం - పురస్కార ప్రదానం:** ఈ వేడుకలో బేడ బుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి హనుమంతు పర్యవేక్షణలో మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ విజేతలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. **అవార్డు గ్రహీతలు:** కిన్నెర యాదగిరి (మహబూబాబాద్ జిల్లా)చిత్తారి వెంకటయ్య (మెదక్ జిల్లా) డాక్టర్ విభూతి వెంకటేశ్వర్లు (సీనియర్ అడ్వకేట్) చిత్తారి గురుపాదం (సామాజికవేత్త)ఉర రామకృష్ణ (టిఎస్ఆర్టిసి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు)ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న అనంతయ్య (అడ్వకేట్, ఎఐబీబీజే అధ్యక్షులు) మాట్లాడుతూ..అంబేద్కరిజాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంలో ఇలాంటి పురస్కారాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.యోధుడు అంబేద్కర్ కు మా నమస్సుమాంజలి అంటూ సభ ముగిసింది.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కో-చైర్మన్లు రమేష్ బాబు,గల్లిబిల్లి ప్రభాకర్,పెద్ద సంఖ్యలో అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.